సాక్షి నిజామాబాద్

ఆదివారం । 16 । జులై । 2023



పేడలో వెలిసి.. గుడిలో కొలువై..

డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో స్వయంభూ లింగక్షేత్రం ప్రత్యేక చరిత్రను సంతరించుకుంది.

- 8లో ▸



జిల్లాలో ఎస్సైల బదిలీ

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 47 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.3 /24.1

ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా వ్యవసాయశాఖలో ఏజీఐ ఆడిట్

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయ శాఖలో ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (ఏజీఐ) అధికారులు ఆడిట్ చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా ఆఫీసులోనే కూర్చొని లెక్కలు తీస్తున్నారు. డివిజన్ల వారీగా ఏడీఏల నుంచి ఫైళ్లను తెప్పించుకుంటున్నారు. జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో కార్యకలాపాలు, ఖర్చులు, ఉద్యోగుల జీత భత్యాలు, రైతుబంధు, రైతుబీమా, ఇతర ఫైనాన్సియల్ స్టేటస్‌ను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి కోసం చేసిన ఖర్చులు సక్రమంగా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా చూస్తున్నారు. లెక్కల్లో ఎక్కడైనా తేడాలుంటే ఏజీఐ అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. అయితే, మరో నాలుగైదు రోజుల పాటు ఆడిట్ కొనసాగనుండడంతో వ్యవసాయాధికారులంతా అప్రమత్తమయ్యారు. ఆడిట్ కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా నలుగురు అధికారులు వచ్చారు.

ట్రయల్ రన్‌కు నీటి విడుదల!



మోపాల్(నిజామాబాద్‌రూరల్): కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోభాగంగా డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి వద్ద నిర్మించిన పంప్‌హౌజ్ ట్రయల్ రన్ కోసం నీటిని విడుదల చేసినట్లు తెలిసింది. మండలంలోని న్యాల్‌కల్ లోగల మాసాని చెరువు నుంచి మెంట్రాజ్‌పల్లి వద్దగల పంప్‌హౌజ్ వరకు నిజాంసాగర్ కెనాల్ ద్వారా శనివారం ఉదయం నీటిని వదిలారు. ఇదేవిషయమై అధికారులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

తెయూ- ఆర్‌ఏఎస్‌సీఐ మధ్య ఎంవోయూ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ, రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌ఏఎస్‌సీఐ)ల మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. హైదరాబాద్‌లోని రూసా కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రిల సమక్షంలో తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, ఆర్‌ఏఎస్‌సీఐ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఎంవోయూ ద్వారా ఆర్‌ఏఎస్‌సీఐ సంస్థ 'స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్షియేటివ్స్ ఇన్ రిటైల్ సెక్టార్' అనే కోర్సుకు సంబంధించి తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులకు సహాయ సహకారాలు అందించనున్నారు. కోర్సును తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలు ఎస్‌ఆర్‌కే, ఆర్‌కే కాలేజ్(కామారెడ్డి), ఎస్ఎస్‌ఆర్ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), నరేంద్ర, విజేత డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్)లలో ప్రవేశపెడుతున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

గొల్లకుర్మలు లేకున్నా.. గొర్రెలిచ్చినట!

■ 11 మందికి గొర్రెలు పంపిణీ చేసినట్లుగా ప్రచారం



దోమకొండ: ఆ ఊళ్లో గొల్లకుర్మలు ఒక్కరు కూడా లేరు. అయినా రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేసిందట.. 11 మందికి రూ. 10.31 లక్షల విలువైన లబ్ధి చేకూర్చారట.. ఇది ప్రతిపక్షాల ఆరోపణ కాదు.. అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చెబుతున్న వాస్తవం. గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి గొట్టిముక్కుల గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజాప్రతినిధులు, నాయకుల ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో 11 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీనికి రూ. 10,31,250 వెచ్చించినట్లు అందులో ఉంది. అయితే గ్రామంలో గొల్లకుర్మలే లేరని గ్రామస్తులు చెబుతున్నారు. గొల్లకుర్మలే లేనిచోట గొర్రెలను ఎవరికి పంపిణీ చేశారన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



ఆర్మూర్ టు టాలీవుడ్

● సినీ పరిశ్రమలో రాణిస్తున్న ఆర్మూర్ ప్రాంత యువకులు
● వెండితెరపై నటులుగా, రచయితలుగా, నిర్మాతలుగా దర్శకులుగా ప్రతిభ

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతోనే సెటిల్‌మెంట్ అని నమ్ముతున్న తల్లిదండ్రులను ఒప్పించి తమకు నచ్చిన సినీరంగంలో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి అహర్నిషలు కష్టపడుతున్నారు ఆర్మూర్ ప్రాంతానికి చెందిన పలువురు యువకులు. రంగుల ప్రపంచమైన సినిమా రంగంలో బ్యాక్ సపోర్ట్ లేకున్నా తమ సొంత టాలెంట్‌నే నమ్ముకొని నిలదొక్కుకుంటున్నారు. అటు సినిమాల్లో నటులుగా, దర్శకులుగా, నిర్మాతగా తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా నిలబడి తమలోని ప్రత్యేకతను వెండి తెరపై నిరూపించుకుని అవార్డులను సైతం సొంతం చేసుకుంటున్నారు. **- ఆర్మూర్**

సండే స్పెషల్



మిస్టర్ హ్యాండ్‌సమ్ ధనుష్ శెట్టి

ఆర్మూర్‌లోని గీతా భవన్ హోటల్ యజమాని లింగం శెట్టి కుమారుడైన ధనుష్ శెట్టి ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. బెంగళూరులోని ఓ కంపెనీలో రెండేళ్లు ఉద్యోగం చేశాడు. 2016లో సౌత్ ఇండియా మిస్టర్ హ్యాండ్‌సమ్‌గా ఎంపికయ్యాడు. నటుడిని కావాలనుకుని తండ్రి ప్రోత్సాహంతో సినీపరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. తండ్రిపై ఆర్థిక భారాన్ని మోపకుండా బిజినెస్ చేస్తూ మరోవైపు అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని ఇప్పటి వరకు మూడు సినిమాల్లో నటించాడు. 'కే' సినిమాలో హీరోగా తెరంగేట్రం చేశాడు. రెండో సినిమా తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన 'కాలేజ్ కుమార్'లో ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ప్రధాన పాత్రలో నటించాడు. మూడో సినిమా 'బాంబే కాలనీ' ఆహా లో విడుదలకు సిద్ధంగా ఉంది.

మంచి నటుడిగా గుర్తింపు కోసం..



సినీ పరిశ్రమలో మంచి నటుడిగా రాణించాలనే లక్ష్యంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నాను. నా నటనను గుర్తించిన దర్శకులు మంచి మంచి బ్యానర్లలో నటించడానికి అవకాశాలు ఇస్తున్నారు. నేను ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా నిలబడేందుకు కష్టపడుతున్నా.

- ధనుష్ శెట్టి, సినీ నటుడు, ఆర్మూర్ పట్టణం

మొదటి సినిమాతోనే అవార్డు..

మామిడిపల్లికి చెందిన అజయ్ వేద్ హీరోగా నటించిన మొదటి సినిమా మట్టి కథలో ఉత్తమ నటనకు గాను ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ యాక్టర్ ఫీచర్ ఫిల్మ్ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఆర్మూర్‌కు చెందిన మానస హైస్కూల్ కరస్పాండెంట్ గణేశ్, పద్మ కుమారుడైన అజయ్ వేద్ బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి 2019లో రామానాయుడు స్టూడియోలో డిప్లొమా ఇన్ యాక్టింగ్ పూర్తి చేశా డు. సినీ పరిశ్రమలో అతనికి ఉన్న ఆసక్తితో పవ న్ కడియాల దర్శకత్వంలో తెరకెక్కిన మట్టి కథ సినిమాలో హీరోగా అవకాశం దక్కించుకున్నాడు.

హీరో కావడమే లక్ష్యం..



డ్యాన్స్‌పై నాకున్న మక్కువతో సినీ పరిశ్రమలో హీరోగా నా ప్రత్యేకతను చాటుకోవాలనే ప్రయత్నం మొదలు పెట్టాను. షార్ట్ ఫిల్మ్‌లతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించడానికి అవకాశాలు వచ్చినా హీరోగా నటించడమే లక్ష్యంగా కష్టపడి సాధించాను. తెలుగు సినీ పరిశ్రమలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకున్నా నా సొంత టాలెంట్‌తో రాణించడానికి ప్రయత్నం చేస్తున్నాను.

- అజయ్ వేద్, సినీ నటుడు, ఆర్మూర్ పట్టణం

అన్‌స్టాపబుల్ నిర్మాతగా రజిత్‌రావు

బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన రజిత్‌రావు వ్యాపార రీత్యా ఆర్మూర్‌లో స్థిరపడ్డాడు. కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా నిర్మించాలనే లక్ష్యంతో నిర్మాతగా మారి ఏ టు బీ ప్రొడక్షన్స్‌పై అన్‌స్టాపబుల్(అన్ లిమిటెడ్ ఫన్) సినిమాను నిర్మించాడు. నటుడు సప్తగిరి, బి గ్‌బాస్ ఫేమ్ సన్నీ ప్రధాన పాత్రలతో స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, డైరెక్టర్‌గా డైమండ్ రత్నబాబు వ్యవహరించి నిర్మించిన ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా 500 థియేటర్లలో జూన్ 9న విడుదల చేశారు.

కుటుంబ సభ్యులతో చూసే సినిమా..



కుటుంబ సమేతంగా చూసి హాయిగా నవ్వుకొనే సినిమా తీయాలనే సంకల్పంతో అన్‌స్టాపబుల్ సినిమా నిర్మించాను. మంచి ప్రజాదరణ లభించింది. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు నిర్మించే దిశగా ప్రయత్నిస్తాం.

- రజిత్‌రావు, సినీ నిర్మాత, ఆర్మూర్ పట్టణం

జానపద నృత్య కళాకారుడి నుంచి..

పెర్కిట్‌కు చెందిన జీవన్ గౌడ్ జానపద నృత్య కళాకారుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ సినిమాల్లో నటించే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాడు. పెర్కిట్‌లో దేశీ కోడి ఆర్డర్ మెస్ నడుపుకునే వాడు. పత్రికలు, పుస్తకాలు చదివి నటనపై ఆసక్తి పెంచుకున్నాడు. 2020లో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న ఘన్‌శ్యాం పరిచయం కావడంతో ఆర్మూర్ ఫోక్ సాంగ్స్ పేరిట సొంతంగా యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో సినిమాల్లో అవకాశాలు రావడం ప్రారంభమైంది. ఇటీవల దర్శకుడు సంజయ్ తెరకెక్కిస్తున్న ఎర్రగుడి సినిమాలో సినీనటి మంచు లక్ష్మి పక్కన విలన్‌గా నటించాడు.

నటుడిగా రాణించి మన్ననలు పొందాలి



మంచి నటుడిగా రాణించాలనే లక్ష్యంతో వ్యయ, ప్రయాసలకోర్చి సినీపరిశ్రమలో అవకాశాలు దక్కించుకుంటున్నాను. జానపద నృత్య కళాకారుడిగా నాకు వచ్చిన గుర్తింపుతో సినీపరిశ్రమలో అవకాశాలు వచ్చాయి. **- జీవన్ గౌడ్,** సినీ నటుడు, పెర్కిట్

అసిస్టెంట్ డైరెక్టర్‌గా రాణిస్తూ..

ఆర్మూర్‌కు చెందిన దురిశెట్టి నర్సింహాచారి, శ్రీదేవిల కొడుకైన దురిశెట్టి సచిన్(బబ్లూ) ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఉద్యోగం ఇష్టం లేక షార్ట్‌ఫిల్మ్‌లు తీయడం ప్రారంభించాడు. ఆయన తీసిన ప్రేయసి అనే షార్ట్ ఫిల్మ్‌కు ఐఎఫ్ఎల్ నేషనల్ లెవల్ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లో ఉత్తమ డైలాగ్ రైటర్‌గా బెంగళూరు వేదికపై అవార్డును కైవసం చేసుకున్నాడు. సినిమా డైరెక్టర్ కావాలన్న పట్టుదలతో పీపుల్స్ మీడియా గ్రూప్ వారు నిర్మిస్తున్న సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

నేనేంటో నిరూపించుకోవాలని..



నెలవారి జీతం కోసం పని చేయకుండా సినిమా డైరెక్టర్ కావాలనుకున్నాను. ప్రస్తుతం పెద్ద ఫిల్మ్ మేకర్స్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. రానున్న రోజుల్లో మంచి సినిమా తీయడానికి స్క్రిప్ట్‌ను సైతం సిద్ధం చేసుకున్నాను. **- దురిశెట్టి సచిన్,** ఆర్మూర్

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

● గోదావరి నుంచి గరిష్టంగా 32,450 క్యూసెక్కులు
● కాళేశ్వరం నుంచి 5800 క్యూసెక్కులు
● 27 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరిగింది. ప్రాజెక్టులోకి శనివారం ఎగువ నుంచి గరిష్టంగా 32,450 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరింది. సాయంత్రానికి 21,810 క్యూసెక్కులకు తగ్గింది. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా 5,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మొత్తంగా ప్రాజెక్టులోకి 38,250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరి సాయంత్రానికి 27,610 క్యూసెక్కులకు తగ్గింది. ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడం వలన వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 406 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా శనివారం రాత్రికి ప్రాజెక్టులో 1067.90అడుగుల(27 టీఎంసీల) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

ఎగువ నుంచి వరద పెరిగే అవకాశం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 27 టీఎంసీలకు చేరింది. కనీసం మరో 23 టీఎంసీల వరద నీరు వచ్చి చేరితే ఖరీఫ్ సీజన్ పంటలకు భరోసా వస్తుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ముస్తాబవుతున్న ఖిల్లా జైలు

● దాశరథి జయంతి వేడుకలకు ఏర్పాట్లు
● జైలును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్న అధికారులు
● జైలు ఆవరణలో గ్రీనరీ పనులు, ఫొటో గ్యాలరీ ఏర్పాటు

నిజామాబాద్ సిటీ: ప్రజా కవి దాశరథి జయంతి వేడుకల సందర్భంగా ప్రసిద్ధి గాంచిన ఖిల్లా జైలును అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 22న దాశరథి జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఖిల్లా స్వాగత ముఖ ద్వారం నుంచి జైలు ఆవరణ వరకు ఫ్లెక్సీలు, విద్యుత్‌లైట్లతో, రంగులతో ప్రాంగణాన్ని అలంకరిస్తున్నారు. ఇప్పటికే జైలు ఆవరణలో పెరిగిన పనికిరాని మొక్కలను తొలగించి బండలు పరిచారు. ఆవరణలో నాలుగువైపులా అందమైన మొక్కలను నాటే పనులు చేస్తున్నారు. ఈ నెల 17 వరకు పనులు పూర్తి కానున్నాయి.

దాశరథి బ్యారక్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

ఖిల్లా జైలులో దాశరథిని బంధించిన బ్యారక్‌లో దాశరథి చిత్రపటాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. బ్యారక్‌ను అందంగా తీర్చిదిద్ది భవితరాలకు దాశరథి తెలంగాణ కోసం చేసిన కృషి గుర్తుండి పోయేలా తీర్చిదిద్దుతున్నారు. జైలు గోడలపై దాశరథి బొగ్గుతో రాసిన నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే అక్షరాలకు మెరుగులు దిద్దుతున్నారు. నెలరోజుల క్రితం ఎమ్మెల్సీ కవిత ఖిల్లా జైలును సందర్శించి జైలులో దాశరథి విగ్రహం, గోడలపై బొగ్గుతో రాస్తున్నట్లు దాశరథి మైనం బొమ్మను ఏర్పా టు చేయనున్నట్లు ప్రకటించారు. మొత్తానికి ఖిల్లా జైలు పర్యాటకంగా తీర్చిదిద్దుతుండటంపై నగర వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖిల్లా జైలు పక్కనే గల రఘునాథ చెరువు కట్టపై గ్రీనరీ పనులు ఇది వరకే 80శాతం పూర్తయ్యాయి. మరోపక్క పనులు జరుగుతుండగా ఈ భూమికి సంబంధించిన వారు కోర్టులో కేసు వేయడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ నెలలో మంత్రి కేటీఆర్ రఘునాథ చెరువు పార్కును ప్రారంభించే అవకాశం ఉంది.



ఖిల్లా జైలులో మొక్కలు నాటి గ్రీనరీ పనులు చేస్తున్న కార్మికులు

హైకోర్టు ఆదేశాలూ బేఖాతర్!

● నిబంధనలకు విరుద్ధంగా బట్టాపూర్ క్వారీ నిర్వహణ
● మూసివేయాలని బీజేపీ ఆందోళన

మోర్తాడ్ : ఏర్గట్ల మండలం బట్టాపూర్ క్వారీ, క్రషర్‌లను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, దీనిని మూసివేయాలని హైకోర్టు ఆదేశించినా అధికార బలంతో యథేచ్ఛగా క్వారీని, హాట్ మిక్సింగ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. క్వారీ వద్ద శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి వేసిన పిల్‌ను విచారించిన హైకోర్టు ధర్మాసనం క్వారీని మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డును ఆదేశించిందని గుర్తు చేశారు. కోట్లాది ప్రజాధనం కొల్లగొట్టిన అధికార పార్టీ నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాట్‌మిక్సింగ్ ప్లాంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండగా దీనిని కూడా మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎలేటి నారాయణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లి శంకర్, మాజీ సర్పంచ్ తోకల నర్సయ్య, నాయకులు ప్రశాంత్, మనోజ్, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బట్టాపూర్ క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

జిల్లాలో 24.2 మి.మీ. వర్షం

■ మరో రెండు రోజులు భారీ వర్షాలు..!

సుభాష్‌నగర్: జిల్లాలోని పలు మండలాల్లో గడిచిన 24 గంటల్లో భారీగా వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సగటున 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్ని మండలం జాకోరా, సిరికొండ మండలం తూంపల్లిలో 10 సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసింది. రాగల రెండు రోజులు కూడా పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో వర్ని మండలంలో అధిక వర్షపాతం, మరో 20 మండలాల్లో సాధారణ, 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఇంకా లోటు వర్షపాతమే నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు..

మండలాలు	వర్షపాతం (మి.మీ.)	మండలాలు	వర్షపాతం
		మోర్తాడ్	45.8
వర్ని	104.2	భోతంగల్	32.0
సిరికొండ	101.0	మోస్రా	30.9
డిచ్‌పల్లి	91.5	కోటగిరి	29.5
ఇందల్వాయి	60.1	రుద్రూరు	27.9
మోపాల్	52.5	జక్రాన్‌పల్లి	26.1
చందూరు	51.3	ధర్పల్లి	25.2
వేల్పూరు	50.5	భీమ్‌గల్	23.2

టీపీసీసీ ప్రచార కమిటీ ఈసీ సభ్యులుగా నియామకం

● జిల్లా నుంచి కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి, దయాకర్, రోహిత్



రంగుల దయాకర్‌గౌడ్



కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: టీపీసీసీ ప్రచార కమిటీలో కార్యవర్గ సభ్యులుగా జిల్లాకు చెందిన కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి, రంగుల దయాకర్‌గౌడ్, గడుగు రోహిత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి చైర్మన్‌గా నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో కార్యవర్గ సభ్యులుగా నిజామాబాద్ జిల్లా నుంచి తమను తీసుకోవడంపై ఈ ముగ్గురు మధుయాష్కీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయం కోసం పాటుపడతామని పేర్కొన్నారు.

కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి గతంలో బోధన్ నియోజకవర్గం నుంచి జనతా పార్టీ, ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేశారు. ప్రస్తుతం ఆయన పార్టీ బోధన్ టిక్కెట్టు రేసులో ఉన్నారు. ఇక దయాకర్‌గౌడ్ గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. మధుయాష్కీకి విధేయుడిగా ఉండడంతో తాజాగా ప్రచార కమిటీలో ప్రాధాన్యం దక్కింది. కాగా మరో ఈసీ సభ్యుడు గడుగు రోహిత్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్టీ తరపున కార్పొరేటర్‌గా ఉన్నారు.

క్లుప్తంగా

17న నిరసన దీక్షలు

నిజామాబాద్అర్బన్: టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యానంద్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, గురుకుల పాఠశాలల్లో వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు.

ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్ జన్మదిన వేడుకలు



సుభాష్‌నగర్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్ జన్మదిన వేడుకలు నగరంలోని తన నివాసంతోపాటు రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, సొసైటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఇతర పెద్దలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, ఐడీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శనివారం డిగ్రీ 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జరిగాయి. 11 మంది విద్యార్థులకు 9 మంది పరీక్ష రాసినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తిగా మెండోరా వాసి



బాల్కొండ: హైకోర్టు న్యాయమూర్తిగా సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసిన అలిశెటి లక్ష్మీనారాయణ స్వగ్రామం మెండోరా. మెండోరా మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం అలిశెట్టి గంగాధర్, రాజుబాయి కుమారుడైన లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. గత విద్యా సంవత్సరం ఆయన తాను చదువుకున్న మెండోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.రెండు లక్షల విలువైన కంప్యూటర్లను అందించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి హైకోర్టు న్యాయమూర్తి కావడం గర్వంగా ఉందని సర్పంచ్ లక్ష్మి రాజారెడ్డి అన్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన రిజిస్ట్రార్



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కళాశాల విద్యాకమిషనర్, తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణను శనివారం తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి సైతం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పేడలో వెలసి.. గుడిలో కొలువై

- నూత్‌పల్లిలో స్వయంభూ లింగ క్షేత్రం
- ప్రత్యేకతను సంతరించుకున్న పురాతన కట్టడం
- మహిమ గల రాజరాజేశ్వరుడికి ఊరంతా భక్తులే...



పశువుల పేడ కింద లభించిన శివలింగం



చంద్రయ్య మహరాజ్ సమాధి



నూత్‌పల్లి శివారులోని రాజరాజేశ్వర స్వామి పురాతన ఆలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి (నూతన పురి కొండ)లో స్వయంభూ లింగ క్షేత్రం ప్రత్యేక చరిత్రను సంతరించుకుంది. ఇక్కడి స్థల పురాణం ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. పశువుల పేడలో వెలసిన ఈ శివలింగం ప్రస్తుతం రాతి గుడిలో కొలువై నిత్యపూజలు అందుకుంటోంది. మహిమ గల రాజరాజేశ్వరుడికి ఊరంతా ప్రతీ సోమవారం అభిషేకాలు, ఏటా జాతర ఉత్సవాలు నిర్వహిస్తూ శివుడిని కొలుస్తున్నారు. ఈ శివలింగాన్ని చూసి దానికి గుడి కట్టించిన జంగం చంద్రయ్య మహరాజ్ జీవిత చరిత్రను తెలుసుకుంటే పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఆలయ చరిత్ర

దాదాపు 150 ఏళ్ల క్రితం జంగం మల్లయ్య, పర్వమ్మ దంపతులకు చంద్రయ్య మహరాజ్ జన్మించారు. 11వ యేటనే శివధ్యానం ప్రారంభించగా, యుక్త వయసులో రాచమ్మతో వివాహం జరిగింది. చంద్రయ్యకు పుత్రిక జన్మించగానే బ్రహ్మచర్య వ్రతాన్ని స్వీకరించాడు. అయితే చంద్రయ్య ముత్త (అమ్మమ్మ) ఒకనాడు పిడకలు చేసేందుకు పశువులు ఉండే ఊరి కొండ ప్రాంతానికి వెళ్లింది. అక్కడ ఒక్క పేడ ముద్దకూడా లభించలేదు. ఇంటికి వెళ్లే క్రమంలో చక్ర వైశాల్యం వెడల్పుతో పేడ ముద్ద కనిపించింది. నేల నుంచి తీయగానే పేడ కింద శివలింగం కనిపించింది. వెంటనే పరుగుపరున ఇంటికి వెళ్లిన ఆమె తన మనవడు చంద్రయ్యకు తెలిపింది. లింగం కనిపించిన స్థలానికి చేరుకున్న చంద్రయ్య లింగాన్ని చూసి పరవశించిపోయాడు. ఎలాగైనా శివున్ని సాక్షాత్కరించాలన్న సంకల్పంతో గుడిని నిర్మించాలనే ఆలోచన మహరాజ్‌కు కలిగింది. శివధ్యానాన్ని మొదలుపెట్టి ఆ ప్రదేశాన్ని శుద్ధి చేసి మార్పులు చేశారు. ఇలా కొన్ని రోజులకు చిన్న గుడిని నిర్మించారు. రాజరాజేశ్వర స్వామిపై భజన, కీర్తనలు రచించి గ్రామగ్రామాన సంచరిస్తూ భక్తి ప్రచారం చేశారు. 35–40 ఏళ్ల మధ్యలో శివుడిలో ఆయన ఐక్యమైనట్లు స్థల పురాణం చెప్తోంది. ఆయన సమాధి కూడా గుడికి కొద్ది దూరంలో ఉంది.

ఎగిరి వచ్చిన నంది..

గుడిలోని నంది విగ్రహానికి ప్రత్యేకత ఉంది. చంద్రయ్య మహరాజ్ గ్రామాల్లో శిష్యమార్గం చేస్తున్న క్రమంలో ఒక దొరగారింట్లో భక్తి, కీర్తనలు చేశారు. విని తరించిన దొర ఏమివ్వాలని అడుగగా, అక్కడే ఉన్న నంది విగ్రహం కావాలని అడిగారట. నీకు సామర్థ్యం ఉంటే తీసుకెళ్లాలని దొర చెప్పిన వెంటనే చంద్రయ్య నంది విగ్రహంపై మంత్రపుష్పాలు వేసినట్లు, మరుక్షణమే నందికి చలనం వచ్చి ఐదు మూరలు రెంకలు కొట్టి వాకిట్లో వాలిందని స్థల పురాణం చెప్తోంది. అక్కడి నుంచి నూతన పురికొండ (నూత్‌పల్లి)కి చేరినట్లు చరిత్ర. అయితే, ఆలయ ప్రాంగణంలో కూడా పలు విశేషాలున్నాయి. గుడి ముందు ధ్వజ స్తంభం, కుడికి జగదాంబ స్తంభం, అలాగే ఎడమకు గండదీపం ఉంటుంది. ఉత్తర దిశలో వేంకటేశ్వర స్వామి సతీసమేతంగా ప్రత్యేక గుడిలో దర్శనమిస్తారు. తూర్పున ఆంజనేయుడు, సరస్వతీ, గణపతి, నాగభరణం ఉంటాయి. గుడి పక్కన వంటశాల (రంగుమాల్) ఉండగా, దీనిపై ఎక్కి చూస్తే ఎస్సారెస్పీ ప్రాజెక్టు కనిపిస్తుంది. ఈ గుడికి ప్రతీకగా గ్రామంలో మరొక కొత్త గుడిని నిర్మించి అక్కడే జాతరను నిర్వహిస్తున్నారు.

ఎలాంటి బాధలైనా తీరుతాయి



వర్షాలు పడి పంటలు బాగా పండాలని గ్రామస్తులంతా గుడిలో లింగానికి అభిషేకం చేస్తారు. అలాగే సంతాన ప్రాప్తి కోసం ఆలయ ఆవరణలో ఉన్న త్రిధల పత్రి వృక్షానికి పూజలుచేస్తారు. రాజరాజేశ్వర స్వామిని 41 రోజుల పాటు పూజిస్తే కోరికలు, బాధలు తీరుతాయి.

– బాపయ్య స్వామి, చంద్రయ్య ముని మనవడు

ఘనంగా జాతర చేస్తాం



గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రతీ ఏడాది అక్టోబర్‌లో ఐదు రోజుల పాటు గ్రామస్తులందరి సహకారంతో పెద్ద జాతరను కన్నుల పండువగా నిర్వహిస్తాం. చుట్టు పక్కల మండలాలే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తారు.

– కూనింటి రవికుమార్, సర్పంచ్, నూత్‌పల్లి

వర్సిటీ విద్యార్థుల గోస పట్టదా



తరగతులు బహిష్కరించి నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెయూ బంద్

తెయూ(డిచ్‌పల్లి):తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థుల గోస ప్రభుత్వానికి పట్టదా అంటూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వర్సిటీ కార్యదర్శి శ్రీశైలం విమర్శించారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వర్సిటీ తరగతులు బహిష్కరించి బంద్ పాటించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. తెయూ ఇన్‌చార్జి వీసీగా నియామకమైన రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ యూనివర్సిటీని సందర్శించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని, బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వర్సిటీ హాస్టల్స్‌లో సదుపాయాలు కల్పించాలని లేదంటే రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విగ్నేష్, తెయూ అధ్యక్షుడు ప్రసాద్, వెంకటేష్, దినేష్, చరణ్, పవన్, సంధ్య, మహేష్ పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్సైల బదిలీలు

- 47 మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 47 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఇన్‌చార్జి ఐజీ చంద్రశేఖర్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఏడాదిన్నరకు పైగా ఒకే చోట పని చేస్తున్న ఎస్సైలు, జిల్లాకు సంబంధించిన ఎస్సైలను జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లా నుంచి ఎస్సైలు జిల్లాకు బదిలీ అయ్యారు.

ఎస్సైల బదిలీల వివరాలు..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన జిల్లా	పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన జిల్లా
పూర్ణేశ్వర్	నిజామాబాద్ రెండో టౌన్	నిర్మల్	అబ్దుల్ రషీద్	వీఆర్, నిజామాబాద్	జగిత్యాల
సాయికుమార్	నిజామాబాద్ ఆరో టౌన్	నిర్మల్	చందయ్య	సీసీఆర్‌బీ, నిజామాబాద్	జగిత్యాల
సందీప్	నిజామాబాద్ నాలుగో టౌన్	ఆదిలాబాద్	నర్సింలు	సిరికొండ	జగిత్యాల
ప్రదీప్‌కుమార్	ట్రాఫిక్, నిజామాబాద్	ఆదిలాబాద్	రాజు	పీసీఆర్, నిజామాబాద్	జగిత్యాల
లింబాద్రి	నిజామాబాద్ రూరల్	నిర్మల్	ఇంద్రకరణ్‌రెడ్డి	షీ టీమ్, ఆర్మూర్	జగిత్యాల
గణేశ్	డిచ్‌పల్లి	నిర్మల్	సంతోష్‌రెడ్డి	సీఎస్‌బీ, నిజామాబాద్	ఆదిలాబాద్
శ్రీకాంత్	జక్రాన్‌పల్లి	నిర్మల్	సాయన్న	డబ్ల్యూపీఎస్, నిజామాబాద్	ఆదిలాబాద్
నరేష్	ఇందల్వాయి	నిర్మల్	శ్యామ్‌కుమార్	వీఆర్, నిజామాబాద్	జగిత్యాల
రాము	ఆర్మూర్	ఆదిలాబాద్	శివరాం	ఆర్మూర్	ఆదిలాబాద్
చంద్రమోహన్	ఆర్మూర్	నిర్మల్	సాయన్న సుంకరి	వీఆర్, నిజామాబాద్	ఆదిలాబాద్
శ్రీకాంత్	నందిపేట్	నిర్మల్	గోవింద్	సీసీఎస్, నిజామాబాద్	ఆదిలాబాద్
ముత్యంరాజు	మోర్తాడ్	ఆదిలాబాద్	రహముతుల్లా	డబ్ల్యూపీఎస్, నిజామాబాద్	ఆదిలాబాద్
రాజు	ఏర్గట్ల	నిర్మల్	పుష్పవతి	వీఆర్, నిజామాబాద్	ఆదిలాబాద్
నరేష్	బోధన్ టౌన్	ఆదిలాబాద్	సాయన్న	బోధన్	ఆదిలాబాద్
బుర్ర నవీన్	ఎడపల్లి	ఆదిలాబాద్	సంజీవ్‌రావు	డబ్ల్యూపీఎస్, నిజామాబాద్	ఆదిలాబాద్
సందీప్	బోధన్ రూరల్	ఆదిలాబాద్	విఠల్‌రావు	సీటీసీ, నిజామాబాద్	ఆదిలాబాద్
సురేష్	సీసీఎస్, నిజామాబాద్	ఆదిలాబాద్	లక్ష్మయ్య	త్రీటౌన్, నిజామాబాద్	ఆదిలాబాద్
మురళి	వీఆర్, నిజామాబాద్	ఆదిలాబాద్	ఉదయ్‌కుమార్	ఒకటో టౌన్, నిజామాబాద్	ఆదిలాబాద్
అమోస్	సీసీఎస్, నిజామాబాద్	నిర్మల్	హబీబ్‌ఖాన్	ఒకటో టౌన్, నిజామాబాద్	ఆదిలాబాద్
మోహన్‌రావు	వీఆర్, నిజామాబాద్	నిర్మల్	దేవికుమార్ దేవతి	నిజామాబాద్ రూరల్	ఆదిలాబాద్
జ్ఞానీసింగ్	ఆరోటౌన్, ఎస్సై	నిర్మల్	హీరాలాల్	వీఆర్, నిజామాబాద్	ఆదిలాబాద్
రాజేశ్వర్‌గౌడ్	ట్రాఫిక్, నిజామాబాద్	నిర్మల్	ఆనంద్‌సాగర్	వర్ని	ఆదిలాబాద్
అఫ్రోద్దీన్	వీఆర్, నిజామాబాద్	జగిత్యాల	పురుషోత్తం	సీటీసీ, నిజామాబాద్	ఆదిలాబాద్

ప్లీనరీకి తరలిన బీసీ సంఘం నాయకులు



ప్లీనరీకి వెళ్తున్న బీసీ సంఘం నాయకులు

నిజామాబాద్ నాగారం : హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఉన్న కేబీఆర్ కన్వెన్షన్‌లో శనివారం బీసీ రాజకీయ ప్లీనరీలో పాల్గొనడానికి జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు 20 వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ 'మేమెంతో మాకంత వాట' అనే నినాదంతో జరుగుతున్న బీసీ రాజకీయ ప్లీనరి ద్వారా బీసీలు తమ సత్తా చాటబోతున్నారన్నారు. ఓట్ హమారా సీట్ హమారా అనే డిమాండ్ తో ముందుకు సాగుతామన్నారు. హైదరాబాద్‌కు బయల్దేరిన వారిలో దర్శనం దేవేందర్, సత్యప్రకాష్, మాడవేడి వినోద్, కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, సురేందర్, కోడూరి స్వామి, లక్ష్మీనారాయణ రాజు, చంద్రమోహన్ తదితరులున్నారు.

గృహ హింస చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: గృహ హింస చట్టం, వర్నకట్న నిషేధ చట్టం, సెక్షన్ 498ఏ పై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు శనివారం అవగాహన కల్పించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఏసీబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, రాజ్ గోపాల్‌గౌడ్, కవితా రెడ్డి, నంద రమేష్, శేషు, నిమ్మ దామోదర్‌రెడ్డి, సమ్మయ్య, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు పూర్తి



నిజామాబాద్‌నాగారం: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఎంపికలు శనివారం పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో నాలుగు, ఐదో తరగతి అడ్మిషన్ల కోసం ఎంపికలు నిర్వహించారు. మొత్తం 40 మంది బాలురు, 17 మంది బాలికలు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న తెలిపారు.

లక్కీడ్రా బాధితులతో మంత్రి ఇంటిని ముట్టడిస్తాం

- ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి



'సాక్షి' కథనాన్ని చూపుతున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: లక్కీ డ్రా పేరుతో మోసాలకు పాల్పడిన అధికార పార్టీ నాయకుల మూలంగా నష్టపోయిన బాధితులతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇంటిని త్వరలోనే ముట్టడిస్తామని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి హెచ్చరించారు. స్కీంలతో నష్టపోయిన బాధితులకు న్యాయం జరుగకపోతే మంత్రి ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. శనివారం మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీల్‌రెడ్డి మాట్లాడారు. వేల్పూర్, మోర్తాడ్, దొన్కల్‌లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య ప్రజాప్రతినిధులే స్కీంల దందాను నిర్వహించారని ఆరోపించారు. సభ్యుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులను వసూలు చేసి బహుమతులు ఇవ్వకుండా అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో స్కీంల మోసాలపై సాక్షి పత్రికలో గతంలో ప్రచురించిన కథనాలను సునీల్‌రెడ్డి ప్రదర్శించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



లింగం(ఫైల్)

నిజామాబాద్ సిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్సై జి లింబాద్రి తెలిపారు. నగరంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన తొందూరు లింగం(43) శుక్రవారం రాత్రి నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్ గ్రామానికి బయలు దేరాడు. కాలూర్‌కు సమీపంలో పందులు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి లింగం రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం రాత్రి మృతి చెందాడు. లింగంకు భార్య సుమలత, కుమార్తెలు సింధూజ, సంకీర్తన ఉన్నారు. మృతుడి తమ్ముడు సంజీవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ కింద పడి ఒకరు..



రమేశ్ మృతదేహం

సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఒకరు ట్రాక్టర్ కింద పడి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. భూంపల్లికి చెందిన ఈదులాయ రమేశ్(49) అనే వ్యక్తి తన సొంత ట్రాక్టర్‌తో వ్యవసాయ భూమిలో దున్నుతున్నాడు. ఈ క్రమంలోపై మడి నుంచి కింద మడికి ట్రాక్టర్‌ను దింపుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా కొట్టింది. దీంతో రమేశ్ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయాడు. తలకు, ఛాతి భాగంలో గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మాచారెడ్డి మండలం ఫరీద్‌పేటకు చెందిన నర్సింలు బైక్‌పై కామారెడ్డికి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి మరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నర్సింలుకు తీవ్ర గాయాలు కాగా కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచి, తరలించేందుకు లారీలో లోడ్ చేస్తున్న 74 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎర్రం శ్రీనివాస్ అనే వ్యాపారి కాలనీలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచాడు. శనివారం ఉదయం వాటిని లారీలోకి ఎక్కిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. మొత్తం 176 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై నరేష్ తెలిపారు.

బాలుడి అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్‌కు చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై లింబాద్రి శనివారం తెలిపారు. ముబారక్‌నగర్‌కు చెందిన భార్గవ్(17) శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడు ఇంటికి వెళ్లివస్తానంటూ తల్లికి చెప్పివెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి చేరుకోక పోవటంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దాంతో శనివారం రాత్రి బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆలయంలో చోరీ

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లి శివారులో గల సాయిబాబా ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. సీసీ కెమెరాకు సంబంధించిన మానిటర్, హుండీని పగుల కొట్టి అందులోని రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మండలంలోని ఆలయాల్లో చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హాస్టల్‌లో ఉండి చదువుకొమ్మన్నందుకు..

- విద్యార్థిని ఆత్మహత్య



శ్రీనిజ(ఫైల్)

రాజంపేట: హాస్టల్‌లో ఉండి చదువుకొమ్మని తల్లి చెప్పడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజంపేటలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్సై రఘు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గడ్డమీది భాగ్యలక్ష్మికి కూతురు శ్రీనిజ (16) ఉంది. ఆమె భర్త గతంలో చనిపోవడంతో భాగ్యలక్ష్మి కూతురితో కలిసి రాజంపేటలో తల్లి దండ్రుల దగ్గర ఉంటూ జీవనం సాగిస్తోంది. శ్రీనిజ స్థానిక కేజీబీవీలో పదో తరగతి వరకు చదువుకుంది. ప్రస్తుతం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. అయితే కేజీబీవీలో ఉన్న మాదిరిగా ప్రస్తుతం హాస్టల్‌లో ఉండి చదువుకొమ్మని శ్రీనిజకు తల్లి సూచించింది. తాను ఇంటి వద్ద ఉండే చదువుకుంటానని శ్రీనిజ మొండికేసింది. దీంతో నెల రోజులుగా నిత్యం ఇంటి నుంచే కాలేజీకి వెళ్తోంది. హాస్టల్‌లో ఉండమని తల్లి తరుచు కోరుతుండటంతో మనస్తాపం చెందిన శ్రీనిజ శనివారం ఇంట్లో ఉరి వేసుకుంది. భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

విద్యార్థినులను కిడ్నాప్ చేసిన ఇద్దరిపై కేసు

రెంజల్: విద్యార్థినులను కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పండ్ల సాయన్న చెప్పారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు రెంజల్‌లో పదో తరగతి చదువుతున్నారని చెప్పారు. శుక్రవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న వారిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి కిడ్నాప్ చేశారని ఎస్సై తెలిపారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకులపై కిడ్నాప్ కేసు నమోదు చేశామన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బొలెరో



నిజామాబాద్ సిటీ: ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్‌కు వస్తున్న బొలెరో వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ముబారక్‌నగర్ వద్దకు రాగానే డివైడర్‌ను వాహనం నడుపుతున్న వ్యక్తి గుర్తించలేదు. దాంతో వాహనం డివైడర్‌ను ఎక్కి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కాగా వాహనం వెనుక బైక్‌పై వస్తున్న వ్యక్తి వాహనాన్ని ఢీకొని గాయపడ్డాడు. అతడిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.